క్లుప్తంగా

తపాలా ఉద్యోగుల నిరసన



అనపర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

పెదపూడి: గ్రామీణ తపాలా ఉద్యోగులు టార్గెట్లు చేయాలని ఒత్తిడి తేవడం తగదని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. అనపర్తిలో శుక్రవారం తపాలా ఉద్యోగులంతా సబ్ పోస్టాఫీస్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. పలువురు మాట్లాడుతూ డాక్ కర్మయోగి, కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులను బలవంతంగా రుద్దడం నిరసిస్తూ ఏఐజీడీఎస్, ఎన్ఎఫ్‌పీఈఫో స్మాన్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన చేపట్టారన్నారు. ఈ యూనియన్ కోశాధికారి వై.కామేశ్వరి, పల్లారావ్, మహేంద్రవాడే బీపీఎం సుమ, ముక్కినాడ బీపీఎం రామలక్ష్మి, విజయపోస్మాన్ సతీష్, తరుణ్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

సీతానగరం: వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో నగదు గల్లంతుపై బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని రాజానగరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు సహకార సంఘాలను దేవాలయాలుగా భావిస్తారని, అటువంటి సంఘాల్లో అవినీతి రాజ్యమేలుతుంటే ఆడిటర్లు, సంబంధిత అధికారులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. వెదుళ్లపల్లి పీఏసీఎస్ నగదు గల్లంతు బాధ్యులెవరనేది గుర్తించినా ఇంత వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, నష్టపోయేది రైతులేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తగు చర్యలు తీసుకోకపోతే రైతుల పక్షాన బీజేపీ పోరాడుతుందని నియోజకవర్గం ఇన్‌చార్జి వీరన్న చౌదరి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గూడపాటి జయరామ్, జనరల్ సెక్రటరి పెరుగు శ్రీను, దాసరి సుబ్బారావు, మద్దాల కొండలరావు తదితరులు పాల్గొన్నారు .

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలు

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు, శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సీబీఎస్ఈ క్లస్టర్ 7 వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో శుక్రవారం విభాగానికి నాలుగు జట్లు చొప్పున తలపడ్డాయి. అండర్ -14లో నయభారత్ పబ్లిక్ స్కూల్ (ఖమ్మం), ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (విజయవాడ), అండర్-17లో రాక్‌వుడ్ స్కూల్ (తెలంగాణా), శ్రీస్వామి నారాయణ స్కూల్ (హైదరాబాద్), అండర్-19లో డాక్టర్ కేఎల్ ప్రసాద్ పబ్లిక్ స్కూల్ (హైదరాబాద్), ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (వరంగల్) విజేతలుగా నిలిచాయి. 6వ తేదీ వరకూ ఈ పోటీలు జరుగుతాయి. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు యశ్వంత్, సీబీఎస్ఈ క్రీడల పరిశీలకులు కిషోర్‌కుమార్ (ఎస్‌కెవిటీ కళాశాల), ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజర్ ఎఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

సరదా విహారం.. కాకూడదు విషాదం..

- ఆనందం మాటున పొంచి ఉన్న ప్రమాదం
- కాలువల్లో సేదతీరుతున్న పిల్లలు
- తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం



కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు

బిక్కవోలు: పండగ సెలవుల్లో పిల్లలు సరదాగా గడిపేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. అయితే సెలవుల వేళ ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ఈ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చారు. చాలా మంది పిల్లలు అనేక మంది కుటుంబ సభ్యులతో వివిధ ప్రాంతాలకు విహార యాత్రలకు వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఇటీవల ఎక్కడ చూసినా పిల్లలు ప్రమాదం బారిన పడుతున్నారు. గతంలో తొస్సిపూడిలో చిన్న కాలువలో ఆడుకుంటే ప్రమాదశాస్తు కాలువ పడి ఏడేళ్ల చిన్నారి తేజ మృతి చెందాడు. రంగంపేట మండలంలోని ఏడీబీ రోడ్డు బైకుపై వెళ్తున్న యువకులు రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. తొస్సిపూడి గ్రామంలోని బైకు వెళ్లి ఇద్దరు యువకులను బస్సు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే కర్రి అజయ్ అని యువకుడు మృతి చెంది తన కుటుంబానికి విషాదం మిగిలిచ్చారు. ఇలా చిన్నపాటి నిర్లక్ష్యం వలన, అలాగే రోడ్డు దాటినప్పుడు, డైవింగ్‌పై అవగాహన లేకుండా ఇంటిలో ఏ పని చెప్పిన బైకుపై వెళుతున్నప్పుడు రోడ్డు ప్రమాదాల్లో బలైన ఘటనలు ఉన్నాయి. ఆలయాలు వద్ద ఆడుకుంటామని చెప్పి వెళ్లి దేవాలయాలు వద్ద కరెంట్ తీగలు పట్టుకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అవగాహన లోపంతో చిన్నారులు పార్కులు, క్రీడా ప్రాంగణాల్లో కాలువల్లో స్నానాలకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పులను పిల్లల ఆటలపై ఓ కన్నేసి గమనిస్తూ వారిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రమాదాలకు నిలయంగా కాలువలు

నియోజకవర్గంలో కొంకుదురు బుడితమామిడి, బిక్కవోలు కెనల్ కాలువ, కొమరిపాలెం దుర్గమ్మ కాలువ వద్ద , పందలపాక శివాలయాలు, అనపర్తి, బలభద్రపురం, తదితర గ్రామాలలో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇలాంటి చోట్లకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. సెలవులు వచ్చాయంటే చాలు ఈ ప్రాంతంలో ప్రమాదకర ప్రదేశాల్లో స్నానాలకు దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాలువలు స్నానానికి పంపించకూడదు.
- పిల్లలు ఆడుకునే స్థలాల్లో బావులు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా ఉన్నాయేమో గమనించాలి.
- ఎత్తయిన మేడలు, శిథిల భవనాల్లో ఆటలాడకుండా చూడాలి. ఇళ్లల్లో ఆడేటప్పుడు అగ్గి పెట్టి, కిరోసిన్, పెట్రోల్ వంటి పేలుడు వస్తువులు వారి వద్ద లేకుండా చూడాలి.
- చిన్నారులను ఒంటరిగా వాహనాలను నడపడానికి అనుమతించకూడదు. వారితో ఎవరో ఒకరు తోడు వేళ్లలా ఉండాలి.
- ఇళ్లల్లోనూ సాధ్యమైనంతగా చిన్నారులను ఒంటరిగా వదలకూడదు.
- ఇతర ప్రాంతాలకు ప్రయాణం అయినప్పుడు కిక్కిరిసిన రైళ్లు, బస్సులు ఎక్కకూడదు. ఒకవేళ ఎక్కాల్సివచ్చినా ఫుట్‌బోర్డు వద్ద ఉండకూడదు.
- పిల్లలపై లైంగికదాడులు, కిడ్నాప్‌లు జరగకుండా సాధ్యమైనంతగా సీసీ కెమెరాలున్న చోట్ల ఆడుకోవడానికి అనుమతించాలి. అపరిచితులతో దూరంగా ఉండాలని హెచ్చరించాలి.
- అపార్ట్‌మెంట్ భవనాల్లో ఉండే పిల్లలు కార్ల డిక్కీల్లో, లిఫ్టుల్లోకి వెళ్లకుండ చూడాలి. ఆటలాడే ప్రాంతంలో ఏదైనా సమస్య ఉంటే పెద్దలకు తెలియజేసేలా సెల్‌ఫోన్(ఆండ్రాయిడ్ కానిది) ఉంచితే మంచిది.
- ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కూర్చొని ఆడే ఆటలకన్నా వ్యాయామంగా ఉండే క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ వంటి ఆటలు పిల్లలు ఆడేలా చూడాలి.
- మానసిక ఒత్తిడి గురి చేసే ఆండ్రాయిడ్ ఫోన్ల ఆటలకు దూరంగా ఉంచాలి.
- డెంగీ, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రజలుతున్నందున పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగించి వారు వర్షంలో, మురుగు నీటిలో ఆడకుండా చూడాలి.
- ప్రస్తుతం గ్రామాల్లో కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. పిల్లలను పంపించేటప్పుడు కుక్కలు దాడి చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఏ మాత్రం జ్వరం ఉన్నా ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. వైద్యసేవలపై నిర్లక్ష్యం ప్రాణాంతకం కావచ్చు.
- ముఖ్యంగా పిల్లలకు బైకు ఇవ్వకూడదు. ఇంటిలో ఏ చిన్నపని వచ్చిన బైకు ఇచ్చి తీసుకురా అని చెప్పడం వంటివి చేయకూడదు.

తల్లిదండ్రులే బాధ్యత తీసుకోవాలి



కాలువల్లో స్నానాలకు, ప్రమాదకర స్థలాల్లో ఆటలకు పిల్లలను పంపించకూడదు. దసరా సెలవుల్లో చిన్నారులను ఇంటి వద్దే ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదు. ఆకతాయిలు పిల్లలను వేధిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

- వాసంశెట్టి రవిచంద్రకుమార్, ఎస్సై బిక్కవోలు

తెలుగులో పీహెచ్‌డీ ప్రదానం



వెంకటరమణమ్మకు పీహెచ్‌డీని అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగం నుంచి వద్ది వెంకటరమణమ్మకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. 'కత్తుల కృష్ణ భాగవతార్ అముద్రిత హరికథా సాహిత్యం- పరిశీలన' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ పీహెచ్‌డీని అందజేశామన్నారు. డాక్టర్ మోగంటి సుధామయి, డాక్టర్ తలారి వాసులు గైడ్, అసిస్టెంట్ గైడ్‌గా వ్యవహరించారు. వెంకటరమణమ్మను యూనివర్సిటీ అధికారులు అభినందించారు.

హైకోర్టు న్యాయవాది అరెస్టు అప్రజాస్వామికం

మధురపూడి: హైకోర్టు న్యాయవాది దళిత నాయకుడు జడ శ్రావణకుమార్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరించడం దుర్మార్గమని కోరుకొండ ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్ కుమార్, దళిత హక్కుల ఉద్యమ నాయకుడు జల్లూరి సురేష్ ఖండించారు. అమరావతిలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చినందుకు శ్రావణ్ కుమార్‌ను అరెస్టు చేయడం తగ్లక్‌పాలనకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై కేసు నమోదు చేయని పోలీసులు, సీనియర్ న్యాయవాది, సామాజిక వేత్త శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. అమరావతి రాజధానిపేరిట దళిత రైతుల నుంచి భూములు తీసుకున్న చంద్రబాబు, వారికి న్యాయం చేయకపోవడంతో ఉద్యమకారులు అక్కడికెళ్తే భయపడుతున్నాడన్నారు.

రైతులకు యాంత్రీకరణ పరికరాలు అందించాలి

- రంగంపేటలో పొలం పిలుస్తోంది



దొడ్డిగుంటలో రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు.

రంగంపేట: రైతులకు వ్యవసాయ యాంత్రికరణకు సంబంధించిన పరికరాలను అందించాలని పలువురు రైతులు అధికారులను కోరారు. మండల పరిధిలోని దొడ్డిగుంట, సుభద్రంపేట గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పంటలను పరిశీలించి అనంతరం రైతులతో మాట్లాడారు. పంట నమోదు చేయించుకున్న రైతులందరూ సోషల్ ఆడిట్ లిస్టులో ఏవైనా తప్పిదాలు ఉంటే తెలియజేస్తే వాటిని సరిచేస్తామన్నారు. వరిలో పొటాష్ ఎరువును మొదటి దఫాగా వేసుకోవాలన్నారు. ఎకరాకు 20 కిలోల చొప్పున వేస్తే పంటకు రోగనిరోధక శక్తి పెరిగి, చీడ పీడల నుంచి పంటను కాపాడుకోవచ్చు అన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వడం వల్ల భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు.కౌలు రైతులకు పంట నష్ట పరిహారం, సబ్సిడీపై విత్తనాలు పొందడానికి ఉపయోగం ఉంటుందన్నారు. అదేవిధంగా ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా వరిలో ఎలుకలు చేసే నష్టాన్ని వివరిస్తూ వాటి నివారణకు నూకల్లో కలిపిన బ్రోమోడయోలిన్ మందును రైతులకు సరఫరా చేశారు. ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ పామాయిల్ మొక్కలు నూరు శాతం రాయితీపై అందిస్తామన్నారు. డ్రిప్ స్ప్రింకర్లు సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం టోటల్ మిక్సిడ్ రేషన్, పశు కిసాన్ క్రెడిట్ కార్డు స్కీమ్స్ గురించి రైతులకు వివరించారు. అనంతరం రోటవేటర్లు, ఆయిల్ ఇంజిన్లు, తైవాన్ స్ప్రేయర్లు, బరకాలు వంటి యాంత్రీకరణ పరికరాలు వ్యక్తిగతంగా ఇవ్వాలని పలువురు రైతులు వ్యవసాయ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిపై విచారణ చేపట్టాలి



వైద్యులు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి: అనపర్తి ఏరియా ఆస్పత్రిలో గర్భిణులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘటనపై విచారణ కమిటీ వేసి విచారణ చేపట్టాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కోరినట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తి ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆస్పత్రికి రెండ్రోజుల క్రితం ఇద్దరు గర్భిణులు ప్రసవం నిమిత్తం వస్తే వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, సరైన వైద్యం అందించలేదని బాధితులు చెప్పారన్నారు. వారికి ప్రసవం అయ్యే పరిస్థితి విషమించిన నేపథ్యంలో ప్రైవేటు ఆస్పత్రి వెళ్లాలని చెప్పి సిబ్బంది పంపించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. వారు వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుని క్షేమంగా ఉన్నారన్నారు. ఈ సంఘటనలో ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిపై వ్యవహారశైలిపై తక్షణం విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఫోన్లో విషయం తెలియజేశానన్నారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడానన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యతగా వ్యవహరించాలని వైద్యులు, సిబ్బందికి ఆయన సూచించారు.

అమ్మవారి ఊరేగింపులో నిబంధనలు తప్పనిసరి



అనపర్తిలో మాట్లాడుతున్న ఎస్సై శ్రీను నాయక్

పెదపూడి: నిబంధనల ప్రకారమే దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపులు, ఉత్సవాలు నిర్వహించాలని అనపర్తి ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు. అనపర్తి మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారి మంటపాలను శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఆయా ఆలయ కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. భక్తుల మనోభావాలకు ఇబ్బంది కలగకుండా నవరాత్రులు నిర్వహించుకోవాలన్నారు. డీజే, రికార్డింగ్, హిజ్రా డాన్సులు తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. ఊరేగింపులు, నిమజ్జనాలు చీకటిపడకుండా ముగించుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించకుంటే చర్యలు



బూరుగుపూడి జంక్షన్‌లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్య కిశోర్

మధురపూడి: ట్రాఫిక్ నిబంధనల పాటించకపోతే చర్యలు తీసుకుంటామని కోరుకొండ సీఐ సత్య కిశోర్ వాహనదారులను హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేశారు. వాహనచోదకుల డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల సీబుక్‌లను పరిశీలించారు. అతివేగం ప్రమాదాలకు మూలమని, నిబంధనల మేరకు వాహనాలను నడపాలని సూచించారు. ప్రశాంత ప్రయాణం సురక్షితంగా ఉంటుందన్నారు.

గ్రామాల్లో ఫ్రైడే - డ్రైడే

సీతానగరం: మండల గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాల్లో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించినట్టు సీతానగరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య తెలిపారు. శుక్రవారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీతానగరం మండల పరిషత్‌లో బదిలీలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు బదిలీ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్ విజయ్ శ్రీనివాస్ దేవీపట్నం మండల పరిషత్‌కు బదిలీపై వెళ్లగా, గోకవరం మండల పరిషత్ నుంచి శివగోపాల్ సీతానగరం మండల పరిషత్‌కు వచ్చారు. అలాగే జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన భరణీకుమార్ కోరుకొండ మండల పరిషత్‌కు బదిలీపై వెళ్లారు. సీతానగరం మండల పరిషత్ కార్యాలయానికి జగ్గంపేట మండలం రాజపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ ఎ.సుమతి బదిలీపై వచ్చారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

- ఆధ్యాత్మికంగా శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి
- అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



సంపరలో గాయత్రీదేవి అవతారంలో విజయదుర్గ అమ్మవారు



బిక్కవోలులో గాయత్రీదేవి అలంకరణలో పార్వతీదేవి



వడిశలేరులో గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



పెదపూడిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సంపరలో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు

పెదపూడి: శరన్నవరాత్రుల ఉత్సవాలు భక్తులు ఆధ్యాత్మికంగా ఉత్సాహంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో వినాయకుడి గుడి సెంటర్లో విజయదుర్గ అమ్మవారిని, సంఘం సెంటర్లో కనకదుర్గదేవిని, కరకుదురులో దుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో కొంతసేపు కూర్చున్నారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ మాజీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, మండల కన్వీనర్ గుత్తుల రమణ, పార్టీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, చిట్టూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. సంపరలో విజయదుర్గ అమ్మవారు రెండో రోజు భక్తులకు గాయత్రి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు, లలితా పారాయణ చేశారు. జి.మామిడాడ గ్రామంలో వారాహి శక్తి పీఠం అమ్మ సిరిమాత అధ్వర్యంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఈనెల 6న అమ్మవారికి చీర సారి మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం

బిక్కవోలు: మండలంలోని పలు గ్రామాల్లో గాయత్రీదేవి అమ్మవారు దర్శనమిచ్చారు. స్థానిక గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న పార్వతిదేవిని గాయత్రీదేవిగా అలంకరణ చేశారు. పందలపాక వెలమపేట రామాలయం వద్ద శ్రీదేవి అమ్మవారి గాయత్రి అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. కొమరిపాలెం, బలభద్రపురం , తొస్సిపూడి గ్రామాల్లో అమ్మవారికి పూజలు చేశారు.

దేదీప్యమానంగా ఉత్సవాలు

రంగంపేట: శరన్నవరాత్ర ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. రంగంపేటలో దేవీ సెంటర్ ఆలయంలో ఉదయం అభిషేకాలు అనంతరం కలశస్థాపన, సహస్రనామ కుంకుమార్చన చేసి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. కట్టుపొంగలి నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీ మాలదారులు ఆలయానికి పోటెత్తి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలతో సుందరంగా అలంకరించారు.

చంద్రేడులో..

స్థానిక కాత్యాయనీ సమేత శ్రీచంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు అనంతరం వెండి, బంగారు నగలతో అలంకరించారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. వడపప్పు, చనివిడి, పానకం, పులిహోర నైవేద్యం సమర్పించారు. భక్తులు భారీగా తరలివచ్చి అభిషేకాలను తిలకించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

దొంతమూరులో..

గ్రామంలోని మెయిన్ రోడ్డులో విజయదుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు జటప్రోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈలకొలనులో..

గ్రామంలోని ముత్యాలమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు భారీ స్థాయిలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వడిశలేరులో విజయదుర్గా అమ్మవారిని రెండో రోజు గాయత్రీదేవిగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం, వడిశలేరు తదితర గ్రామాలలో ఆలయాల వద్ద విజయ దశమి శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి మండపాల్లో కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సరస్వతి మాతకు కుంకుమ పూజలు

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో కొలువైన చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహం వద్ద కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 9వ తేదీన మూల నక్షత్రం కావడంతో సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు ఎక్కువ ఆసక్తిని చూపిస్తుంటారు. ఈ ప్రాంతంలో సరస్వతి మాత కొలువుతీరి ఉన్న ఆలయం రాజానగరంలోని సాయిబాబా ఆలయం ఒక్కటే కావడంతో కుంకుమ పూజలకు కూడా భక్తులు ముఖ్యంగా విద్యార్థులు ఎక్కువగా వస్తుంటారు.



జి.మామిడాడలో వారాహి శక్తిపీఠంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



రాజానగరంలోని సాయిబాబా ఆలయంలో ఉన్న సరస్వతీమాతకు కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



చంద్రేడులో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు